సాక్షి జగిత్యాల

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023

కృష్ణుడు వచ్చాడే..

కోరుట్ల: జిల్లావ్యాప్తంగా బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తొలుత శ్రీకృష్ణామందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో ఉట్టికొట్టే కార్యక్రమాలు చేపట్టారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలతో అలరించారు. ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు. స్వచ్ఛంద, యువజన తదితర సంఘాల ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

పోలీసుల బందోబస్తు



తిమ్మాపూర్ చౌరస్తాలో పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి వద్ద బుధవారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ భూమిలో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసేందుకు కొద్దిరోజులుగా ప్రయత్నం చేస్తున్నారు. వారిని తిమ్మాపూర్ గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది అడ్డుకుంటూ వస్తున్నారు. ఈక్రమంలో జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలోకి ఎవరూ ప్రవేశకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓటరు నమోదు, ఓటుహక్కు వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలపై విద్యార్థినులు రంగురంగులతో చిత్రాలు గీశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొట్టాల తిరుపతిరెడ్డి, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

‘స్పైసీ’గా టోకరా!

- ‘దళితబంధు’లో దగా
- యూనిట్ స్థాపిస్తామని మోసం
- ఐదుగురి నుంచి రూ.32లక్షలు వసూలు
- తూతూమంత్రంగా షెడ్డు నిర్మాణం
- ఆ తర్వాత పనుల్లో తీవ్రజాప్యం
- ప్రశ్నిస్తే.. బెదిరిస్తున్న నేతలు



‘నా పేరు ముత్తునూరి గంగారాం. స్వగ్రామం దేశాయిపేట. 2022లో దళిత బంధు మంజూరైంది. జెడ్పీ వైస్ చైర్మన్ నాతో బ్యాంకు నుంచి రూ.8 లక్షలు డ్రా చేయించారు. ఇలా నాతోపాటు మరో నలుగురితో మొత్తంగా రూ.32 లక్షలు డ్రా చేయించారు. ఈ సొమ్ముతో స్పైసీ యూనిట్ పెడుతమన్నరు. రూ.12 లక్షల విలువైన పనులు కూడా చేయలేదు. నాకో ఎక్సెల్ బండి కొనిచ్చి మోసం చేసింద్రు. పనులు ఎందుకు పూర్తికాలేదని అడిగితే ఏం చేసుకుంటవో చేసుకో అని బెదిరిస్తుంద్రు’



‘నాపేరు ఉమ్మడి రాకేశ్, ఊరు పాత మేడిపల్లి మండలం మన్నెగూడెం. రెండేళ్ల కింద దళితబంధు ఇచ్చింద్రు. స్పైసీ యూనిట్ పెడితే బాగుంటుందని చెప్పిన మా జెడ్పీవైస్ చైర్మన్.. రూ.5 లక్షల దళితబంధు పైసలు డ్రా చేయించింద్రు. పనులు చేస్తలేరని కలెక్టర్ నోటీసు ఇచ్చింద్రు. యూనిట్ పెట్టిస్తమని చెప్పి మా డబ్బులు తీసుకున్న లీడర్లను అడిగితే కాలాయాపన చేస్తుంద్రు. ఎంపీడీవో సారును అడిగితే.. మా ఖాతాల్లో డబ్బు జమచేశామని, తామేమీ చేయాలంటున్నరు’

ఇలా పాత మేడిపల్లి మండలానికి చెందిన ఐదుగురు దళితబంధు లబ్ధిదారులు స్పైసీ యూనిట్ పేరిట తమకు మోసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా మిగిలిన షెడ్డు నిర్మాణం



దేశాయిపేటలో స్పైసీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు

కోరుట్ల/మేడిపల్లి: జిల్లాలోని పాత మేడిపల్లి మండలానికి 2022లో మొత్తం 12 దళితబంధు యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో దేశాయిపేటకు చెందిన ముత్తునూరి గంగారాం, మన్నెగూడేనికి చెందిన ఉమ్మడి రాకేశ్, ఈదుల లింగంపేటకు చెందిన ఎడ్ల రమేశ్, గోవిందారానికి చెందిన నెల్లుట్ల గంగు, పసునూర్‌కు చెందిన దాసరి స్వప్న ఉన్నారు. పాత మేడిపల్లి మండలంలో మిర్చి, పసుపు బాగా పండుతుండడంతో ఐదుగురితో ఒక స్పైసీ యూనిట్ స్థాపిస్తే మంచి ఆదాయం వస్తుందని జెడ్పీటీసీ, జెడ్పీ వైస్ చైర్మన్ సూచించారు. వారి సూచనల మేరకు దళితబంధు ద్వారా వచ్చిన డబ్బును ఐదుగురు దశలవారీగా బ్యాంకుల నుంచి డ్రా చేస్తూ వచ్చారు. ఆ సొమ్మును దేశాయిపేట వద్ద స్పైసీ పరిశ్రమ స్థాపించేందుకు జెడ్పీవైస్ చైర్మన్, వైస్ ఎంపీపీలకు అప్పగించారు. ఇలా మొత్తం రూ.32 లక్షలు ముట్టజెప్పారు. కానీ, ఇప్పటివరకు రూ.12లక్షల విలువైన పనులే జరిగాయి. మిగిలిన డబ్బులు కాజేశారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

లబ్ధిదారులకు నోటీసులు..

- దేశాయిపేట వద్ద స్పైసీ యూనిట్‌కు చెందిన పనులు ఏడాదిన్నరగా సాగుతున్నా.. షెడ్ల వరకే పరిమితమయ్యాయి.
- దీంతో పనులు ఎందుకు పూర్తికాలేదని కలెక్టర్ నుంచి దళితబంధు లబ్ధిదారులకు ఇటీవల నోటీసులు వచ్చాయి.
- ఆందోళన చెందిన లబ్ధిదారులు ముత్తునూరి గంగారాం, ఉమ్మడి రాకేశ్.. సదరు నేతలను ఇటీవల కలిశారు. యూనిట్ పనులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వీటి గురించి అడిగితే బెదిరిస్తున్నారని, వారితో తమకు ప్రాణభయం ఉందని బాధితులు చెబుతున్నారు. కాగా, స్పైసీ యూనిట్ పేరిట తాము మోసపోయామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ క్రితం ముత్తునూరి గంగారం కలెక్టర్, ఎస్పీలకూ ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

బీఆర్ఎస్ నాయకులు సొంతానికి వాడుకున్నారు..



బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ నేత తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): దేశాయిపేటలో దళితబంధు పేరిట దళితులను ఆర్థికంగా మోసం చేసిన ఘటనపై విచారణ జరిపించాలని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు తుల ఉమ డిమాండ్ చేశారు. బుధవారం దేశాయిపేట, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. దళితుల పేరిట విడుదలైన డబ్బులను బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతిధులు, నాయకులు తమ సొంతానికి వాడుకున్నట్లు బాధితులు తమతో వాపోయారని తెలిపారు. ఇటువంటి వాటిపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని కోరారు. అవినీతికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ మైనార్టీ సెల్ నాయకుడు ఎండీ ఇక్బాల్ పాల్గొన్నారు.

మాకు సంబంధం లేదు

స్థానికంగా స్పైసీ యూనిట్ పెడితే లాభదాయకంగా ఉంటుందని లబ్ధిదారులకు సూచించాం. యూనిట్ పనులపై వారికి అవగాహన లేదు. అందుకే మేము దగ్గరుండి పనులు చేయిస్తున్నాం. యంత్రాలు రావడంలో ఆలస్యమవుతోంది. అంతేకానీ, మేం ఎవరి డబ్బులూ తీసుకోలేదు. ఎవరినీ బెదిరించలేదు.

– హరిచరణ్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్

విచారణ జరిపించాలి

మేడిపల్లిలో దళితబంధు లబ్ధిదారుల డబ్బులు స్పైసీ యూనిట్ పేరిట కాజేసిన బీఆర్ఎస్ నాయకులపై విచారణ జరపాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– నరేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు

మరింత అభివృద్ధి చేస్తా

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కొనసాగుతున్న ప్రజా ఆశీర్వాదయాత్ర



ధర్మపురిలో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్

బుగ్గారం/ధర్మపురి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తనను మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సిరికొండ, మద్దునూర్, రామయ్యపల్లిలో బుధవారం ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దూసుకుపోతోందని, ఇందుకు సీఎం కేసీఆర్ పాలన తీరే కారణమని పేర్కొన్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే కొందరు నాయకులు ప్రజాక్షేత్రంలోకి వచ్చి హడావుడి చేస్తారని, ప్రజల సానుభూతి పొందేందుకు చిరిగిన దుస్తులు, చెప్పులతో గ్రామాలకు వస్తారని ‘అడ్లూరి’పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటలే కరెంట్ ఇస్తారని విమర్శించారు. కాగా, మద్దునూర్ గ్రామస్తులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంపీపీ రాజమణి, వైస్ ఎంపీపీ సుచేందర్, సర్పంచులు చెన్నమల్ల దివ్య, దోరగండ్ల జగన్, నాయకులు గాలిపెల్లి మహేశ్, తాండ్ర సత్యనారాయణరావు, అబ్దుల్ రహమాన్, కట్ట రాజేందర్, నోముల లత తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు రూ.9.80కోట్లు

పెగడపల్లి/గొల్లపల్లి(ధర్మపురి): నియోజవర్గంలోని వివిధ మండలాల్లో గిరిజన తండాల అభివృద్ధికి గిరిజన అభివృద్ధి శాఖ నుంచి రూ.9.80 కోట్లు మంజూరైనట్లు మంత్రి ఈశ్వర్ తెలిపారు. గ్రామాల నుంచి తండాలకు తారు రోడ్లు నిర్మించేందుకు ఈ నిధులను కేటాయించినట్లు మంత్రి చెప్పారు.

మ్యుటేషన్ పంచాయితీ!

పెద్దపల్లి జిల్లాలోని ఓ కుగ్రామంలో ఉన్న ఇల్లు వారసత్వంగా వచ్చింది. నాలుగు తరాలుగా అదే ఇంట్లో వారసులు కూడా నివసిస్తున్నారు. అయితే ఆ ఇంటిని వారసుల పేరిట మార్చుకోవాలనుకున్నారు. కానీ.. ఇంటి యజమాని మరణించిన కారణంగా విరాసత్ కావడం లేదు.

సిరిసిల్ల మండలంలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఇటీవల ఆయన స్వగ్రామంలోని పొరుగింటిని కొనుగోలుచేశాడు. మ్యుటేషన్ చేయించుకోవాలని యత్నించినా.. సాధ్యంకాలేదు.

ఇది పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలోని పరిస్థితే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొన్న దుస్థితి. ఆస్తులు తమవే అయినా.. పేర్లు మారకపోవడం.. యజమానులు మరణించడం.. వెరసి ఏంచేయాలో తెలియక వారసులు సతమతమవుతున్నారు. మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.



- వారసులకు దక్కని పూర్వీకుల ఇళ్లు
- మ్యుటేషన్, ఎడిట్ ఆప్షన్ తీసేసిన ప్రభుత్వం
- ఏప్రిల్ నుంచి వేలాది దరఖాస్తులు పెండింగ్
- రూ.లక్షలు పోసి ఇళ్లు కొన్నా.. పేరు మారని వైనం
- చనిపోయిన వారి పేర్లమీదే రూ.కోట్లాది ఆస్తులు

గ్రామ పంచాయతీల సమాచారం

జిల్లా	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్నసిరిసిల్ల	జగిత్యాల
గ్రామపంచాయతీలు	313	267	255	380

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఒకప్పుడు గ్రామాల్లో ఆస్తుల బదిలీ రెండు రకాలుగా జరిగేది. మొదటిది వారసుల పేరు మీదికి.. రెండోది ఇంటిని కొన్న వారి పేర మ్యుటేట్ అయ్యేవి. ఇందుకు సంబంధించిన ‘ఇ–పంచాయత్’ వెబ్‌సైట్‌లో మీ సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకునేవారు. ఇందుకోసం రెండు ఆప్షన్లు అందుబాటులో ఉండేవి. అందులో మొదటిది విరాసత్, రెండోది కోర్టు డిక్రీ. ఇందులో ఇంటి యజమానులు తమ ఆస్తులను విరాసత్ దరఖాస్తు ద్వారా వారసులకు ఇచ్చేవారు. రెండు కొనుగోలు చేసుకున్న వారు కోర్టు డిక్రీ ద్వారా దరఖాస్తు చేసుకునేవారు. ఈ దరఖాస్తులను గ్రామ పంచాయతీ సెక్రటరీ విచారణ జరిపిన తర్వాత ఆస్తి మ్యుటేట్ అయ్యేది. గతంలో ఎడిట్ ఆప్షన్ కూడా ఉండేది. దీంతో ఏమైనా తప్పులు ఉన్నా దాన్ని అక్కడే పరిష్కరించుకునేవారు. ఇది చాలా వేగవంతమైన ప్రక్రియ తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తయ్యేది. కానీ.. ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుంచి టీఎస్, బీపాస్ అమల్లోకి తీసుకువచ్చింది. దీని ప్రకారం.. గ్రామపంచాయతీ ఆస్తుల రిజిస్ట్రేషన్లు అన్నీ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే జరుగుతున్నాయి. దీంతో ‘ఇ–పంచాయత్’ వెబ్‌సైట్లో విరాసత్, కోర్టు డిక్రీ ఆప్షన్లు మాయమయ్యాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది ఇళ్ల బదిలీ కాక అలాగే మిగిలిపోతున్నాయి.

సమస్య ఏంటి?

నాలుగు జిల్లాల్లోని గ్రామాల్లో వేలాది ఇండ్లకు సరైన ధ్రువపత్రాలు లేవు. దశాబ్దాల తరబడి వారసత్వంగా ఇండ్లు చేతులు మారుతున్నాయి. వాటికి ఇంటి నెంబర్లు ఉంటాయి. ఏటా ఇంటి పన్నులు కడుతారు. కానీ.. ఆ ఇల్లు కొన్నట్లు, కట్టినట్లు ఎలాంటి పత్రాలు లేవు. వాస్తవానికి గ్రామపంచాయతీల ఆవిర్భవానికి ముందు నుంచే ఆ ఇళ్లు మనుగడలో ఉన్నాయి. ఇలాంటి ఇళ్ల పరిస్థితుల్లో ప్రధానమైన చిక్కులు తలెత్తుతున్నాయి.

అడ్డంకులివే..

- ఇంటి యజమానులు లేకుంటే ఆ ఇళ్లు వారసుల పేరిట బదిలీ కావడం లేదు. యజమాని బతికుంటే విరాసత్ సజావుగా సాగుతున్నాయి.
- ఇంటి నెంబరు, ఇంటి పన్నులు కట్టిన కాగితాలు తప్ప ఇంటికి సంబంధించిన ఇతర డాక్యుమెంట్లు ఏవీ లేని ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.
- ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లు.. అంతకుముందు సరైన డాక్యుమెంట్లు లేని ఇండ్లను చాలామందే కొనుగోలు చేశారు. వీటిలో చాలామటుకు మ్యుటేషన్ కాలేదు. టీఎస్ బీపాస్‌తో ఆస్తులు మ్యుటేషన్ కాకపోవడంతో ఆఫీసర్లు పక్కన పెడుతున్నారు.
- గతంలో రేకుల ఇల్లు/ పెంకుటిల్లును కూల్చి, గ్రామంలో కొత్తగా జీ+2 నిర్మించుకున్నా సరే ఆన్‌లైన్‌లో ఇంకా పాత రేకుల ఇల్లు/ పెంకుటిల్లుగానే చూపెడుతోంది. ‘ఎడిట్’ ఆప్షన్ లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో అన్ని అనుమతులతో ఇల్లు నిర్మించుకున్న యజమానులు, పన్నులు రాక పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇబ్బందులివీ..

- కుటుంబ అవసరాలకు ఇంటిని విక్రయించాలనుకుంటున్న వారికి పేరుమార్పిడి నిబంధన ఇబ్బందికరంగా మారింది.
- పెళ్లిళ్లు, అనారోగ్య కారణాలతో సతమతమవుతున్న వారు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.
- ఆస్తులు అమ్మాలనుకుంటున్న వారు పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, వార్డు మెంబర్ల చూట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- వృద్ధులు, నిరక్షరాస్యులు ఏంతెలియక సతమతమవుతున్నారు. ఇంకొన్నిచోట్ల ఇదే అదనుగా కొందరు ఇదిచేస్తాం.. అదిచేస్తామంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.
- గతంలో ఇంటిని కొన్నాక.. ఇప్పుడు మ్యుటేషన్ కాకపోవడంతో కొనుగోలుదారుడు, విక్రయదారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పేరు మారని ఆస్తులు మాకేందుకంటూ నిలదీస్తున్నారు.

ఆప్షన్ తీసేయడంతో ఇబ్బందులు



గ్రామపంచాయతీకి పన్ను రూపంలో రావాల్సిన నిధులు రావడం లేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడుతోంది. ఆస్తులు వారసుల పేరిట మారడం ఇబ్బందికరంగా మారింది. ఆప్షన్‌ను పునరుద్ధరించాలి.

– సంధ్యారాణి, సర్పంచ్, పోరండ్ల, జగిత్యాల రూరల్

కమిటీ నివేదిక రావాలి

ఏప్రిల్ ఒకటి త ర్వాత టీఎస్ బీ పాస్ అమల్లోకి వచ్చింది. ఆస్తుల పేర్లమార్పిడిపై ఎదురవుతున్న ఇబ్బందులపై అభ్యంతరాలు, వినతులు వెల్లువెత్తాయి. ఈ విషయాన్ని హైదరాబాద్‌లోని ఉన్నతాధికాల దృష్టికి తీసుకెళ్లాం. మ్యుటేషన్ సమస్యలు అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీ వేసింది. సమస్యలపై ఆ కమిటీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. వివిధ అంశాలతో కూడిన నివేదిక తయారు చేసింది. ఆ కమిటీ నివేదిక త్వరలో ప్రభుత్వానికి అందజేయనుంది. సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆశిస్తున్నాం.

– వీరబుచ్చయ్య, డీపీవో, కరీంనగర్

పద్మశాలీల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



ప్రొసీడింగ్స్ అందిస్తున్న విద్యాసాగర్‌రావు

కోరుట్ల: పద్మశాలీల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం పద్మశాలీ కులోన్నతి సంఘం పట్టణాధ్యక్షుడు జక్కుల ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత పద్మశాలీ కులోన్నతి సంఘం కల్యాణమండపం, ఇతరత్రా అభివృద్ధి పనుల కోసం రూ.80 లక్షలు మంజూరు చేసిన ప్రొసీడింగ్స్‌ను సంఘం ప్రతినిధులకు అందించారు. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, పద్మశాలీ సంఘం కోరిక మేరకు చేనేత సొసైటీని పునరుద్ధరించామన్నారు. కల్యాణ మండపం కోసం సుమారు రెండెకరాల బాధ్యత తనదే అన్నారు. దీనికోసం మళ్లీ నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. పద్మశాలీలు ప్రతీసారి తన గెలుపులో పాలుపంచుకున్నారని, వారికి రుణపడి ఉంటామని అన్నారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్, మినీట్యాంక్‌బండ్, ప్రధాన రహదారులను బీటీ రోడ్లుగా మార్చడం, తహసీల్దార్ కార్యాలయాన్ని కల్లూర్‌రోడ్డులో కట్టించడానికి నిధుల కేటాయించామని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేనేత కార్మికులకు పింఛన్లు, మరమగ్గాలు అందిస్తుందన్నారు. చేనేత సహకార సొసైటీని త్వరలో స్థానికులతో ఏర్పాటైన కమిటీకి అప్పగిస్తామన్నారు. బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, పద్మశాలీ సంఘం నాయకులు గడ్డం మధు, జక్కుల జగదీశ్వర్, గజెల్లి లక్ష్మయ్య, చెన్న విశ్వనాథం, ప్రభాకర్, వాసం భూమానందం, వాసం భూమేశ్వర్, సదుబత్తుల హరిప్రసాద్, రాడం అశోక్, బాలె నర్సయ్య, జిల్లా ధనుంజయ్, జిందం లక్ష్మీనారాయణ, ఎంబేరి నాగభూషనం, ఆడెపు మధు, గుడ్ల మనోహర్, రాజగంగారాం, రుద్ర సుధాకర్, లక్ష్మీపతి, రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు వరం

సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని విద్యాసాగర్‌రావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.8 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీపీ తోట నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈహెచ్‌టీ టవర్ పునరుద్ధరణకు చర్యలు

- ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ



ప్రమాదకరంగా ఉన్న ఈహెచ్‌టీ టవర్

కోరుట్ల: మల్లాపూర్ మండలం సాతారం శివారు వాగు సమీపంలోని ఈహెచ్‌టీ టవర్ కూలిపోయే ప్రమాదంలో ఉందని, దీంతో పునరుద్ధరణ పనులు చేపట్టామని ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ క్రమంలో కోరుట్ల, వేములవాడ సెగ్మెంట్లలో విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. భారీవర్షాలతో వాగు ఉధృతికి టవర్ బేస్‌మెంట్ పైకి తేలి కోతకు గురై కూలిపోయేలా ఉందని గుర్తించామన్నారు. దీంతో పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచామన్నారు. దీంతో ధర్మారం 132 కేవీ సబ్‌స్టేషన్, గోదూర్ సబ్‌స్టేషన్, జగితాల్య–కోరుట్ల ఫీడర్ల పరిధిలోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. కండక్టర్ మార్చేటపుడు కోరుట్ల, గోదూరు, కథలాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోనూ సరాఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రత్యామ్నాయంగా పోచంపాడ్ నుంచి తాత్కాలికంగా విద్యుత్ సరాఫరాకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. పనులు పూర్తిఅయ్యేవరకు వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు విస్తరణకు చర్యలు



మార్కింగ్ చేస్తున్న అధికారులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని యావర్‌రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టారు. బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాలకు మార్కింగ్ చేశారు. గతంలో 40 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును ఇప్పటికే 60 అడుగులకు విస్తరించారు. ప్రస్తుతం 100 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రభుత్వం ఇటీవల టీడీఆర్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు అధికారులు పనులు మొదలుపెట్టారు. కార్యక్రమంలో టీపీవో తేజస్విని, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నియామకం


నల్ల వెంకటేశ్

మెట్‌పల్లిరూరల్ : బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్తక్కపల్లికి చెందిన నల్ల వెంకటేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నరేశ్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ నియామకం వెంటనే అమలులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

పర్స్ అప్పగింత


పర్స్ అప్పగిస్తున్న నాయకులు

సారంగాపూర్(జగిత్యాల): ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు బుధవారం తిరిగి అప్పగించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రోటిగూడకు చెందిన తూము లక్ష్మీనారాయణ ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామం నుంచి స్వగ్రామం వెళ్తున్నాడు. ఈ క్రమంలో తన పర్సును కొల్వాయి గ్రామ శివారుల్లో పోగొట్టుకున్నాడు. అదే సమయంలో వ్యవసాయ పనుల నిమిత్తం రోడ్డుపై వెళ్తున్న ఎంపీటీసీ రంగు లక్ష్మణ్.. ఆ పర్సు చూశారు. అందులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా ఆ వ్యక్తికి ఫోన్ చేశారు. లక్ష్మీనారాయణ అక్కడకు రాగానే పర్సు అందజేశారు. సింగిల్ విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు ఆయన వెంట ఉన్నారు. కాగా, పర్సులో పెద్దమొత్తంలో నగదు, విలువైన సర్టిఫికెట్లు ఉన్నాయి.

వైద్యం కోసం ఆర్థికసాయం


చెక్కు అందిస్తున్న బీఎస్‌రావు

కథలాపూర్(వేములవాడ): చింతకుంట గ్రామానికి చెందిన చిట్యాల రోజ ఇటీవలే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవించింది. ఒకే కాన్పులో ఇద్దరు పిల్లలు జన్మించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడం.. వైద్యం కోసం రోజూ రూ.40వేలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆమె కుటుంబ పరిస్థితిని చూసిన ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్‌రావు.. బుధవారం రూ.20 వేలు కసాయం చేశారు. ఇకనుంచి పిల్లల వైద్యం కోసం అయ్యే ఖర్చును కరీంనగర్‌కు చెందిన కెట్టొ స్వచ్ఛంద సంస్థ భరించేందుకు ముందుకు వచ్చిందని బీఎస్ రావు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: అరవింద్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎనగందుల శ్రీనివాస్(42) మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్‌కు 20ఏళ్లక్రితం శ్రీలతతో వివాహం జరిగింది. వీరికి సంతానం కలుగలేదు. ఇంట్లోనే కిరాణం షాపు నిర్వహిస్తూ బతుకుతున్నారు. ఇటీవల కిరాణంలో నష్టాలు వచ్చాయి. అప్పులు పెరిగాయి. దీంతో శ్రీనివాస్ కొద్దికాలంగా మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఎలా తీర్చేదని మనస్తాపంతో ఉంటున్నాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో కిరాణంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి

- డిగ్రీ, జూనియర్ కళాశాలలకు ఇన్‌చార్జిలు
- 18ఏళ్లు నిండినవారి పేర్ల నమోదు లక్ష్యం
- ప్రతీరోజు ఓటర్ నమోదుపై కలెక్టర్‌కు అధికారుల నివేదిక


ఓటుహక్కు వినియోగించుకున్నట్లు చెబుతున్న యువత

జగిత్యాలజోన్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటినుంచే ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త ఓటర్ల నమోదుతో పాటు జాబితాలో పొరపాట్ల సవరణ వంటి కార్యక్రమాలను విస్తృతం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు ప్రతీరోజు వీడియా కాన్ఫరెన్సుల ద్వారా జిల్లా అధికార యంత్రాగానికి ఆదేశాలు జారీచేస్తుండడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలివిడతలో ఇప్పటికే ఈవీఎంల పనితీరు పరిశీలించే ప్రక్రియ పూర్తిచేశారు. ప్రస్తుతం, యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించారు.

కళాశాలల్లో స్పెషల్ డ్రైవ్..

- కళాశాలల్లో అర్హులైన విద్యార్థుల పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసేందుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.
- ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఎలెక్షన్ సెల్ ఏర్పాటు చేసి నోడల్ అధికారిని నియమించారు.
- ఈ ఏడాది అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్ల వయసు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.
- 18 ఏళ్ల వయసు నిండిన వారు విద్యాభ్యాసం, వృత్తిపరంగా డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఉన్నారు.
- దీంతో అక్కడే ఓటరు జాబితాలో వారి పేర్లు నమోదు చేయించాలని జిల్లా యంత్రాంగం భావించి, అమలుకు శ్రీకారం చుట్టింది.
- జిల్లాలో ప్రముఖ విద్యా సంస్థలైన జేఎన్టీయూ, అగ్రికల్చర్, వెటర్నరీ, మెడికల్, పాలిటెక్నిక్, నర్సింగ్ కాలేజీలు, 20 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.
- ఇందులో 9,593 మంది విద్యార్థులు చదుకుంటున్నారని గుర్తించారు.
- ఇందులో ఇప్పటివరకు 7,549 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు.
- మిగిలిన విద్యార్థుల పేర్లు నమోదు చేసుకునే బాధ్యతను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు అప్పగించారు.
- ప్రతీరోజు ఆయా కాలేజీల్లో ఏ మేరకు పేర్లు నమోదు చేశారనే నివేదికలు రూపొందిస్తున్నారు.

గ్రామాల్లోనూ ప్రత్యేక దృష్టి..

గ్రామాల్లో యువ ఓటర్ల నమోదుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వారీగా కొత్త ఓటర్ల కోసం అన్వేషిస్తున్నారు. గ్రామాల్లో చదువుకోకుండా పనులు చేసుకునే 18 ఏళ్లు నిండిన యువతీయువకులను ఓటర్లుగా నమోదు చేస్తున్నారు. ఇందుకోసం, కలెక్టర్ యాస్మిన్ బాషా స్వయంగా పోలింగ్ కేంద్రాల వారీగా కొత్త ఓటర్ల నమోదు పరిశీలిస్తున్నారు. పేర్ల నమోదుకు మైకుల్లో లేదంటే డప్పు చాటింపు ద్వారా ప్రచారం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏపీఎంలు ఓటర్లకు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఓటర్లుగా పేర్లు నమోదు చేయించుకునేవారు ఒక ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్‌లను అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తే సరిపోతుంది.

పేరు నమోదు చేయించుకున్న



నాకు 18 ఏళ్ల వయసు పూర్తయ్యింది. మా కాలేజీలో ఇటీవల ఏర్పాటు చేసిన స్పెషల్ ఎలక్షన్ సెల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఓటర్‌గా పేరు నమోదు చేయించుకున్న. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకుంట.

– ఆర్.బిందు

ఇది మంచి అవకాశం



కాలేజీల్లో ఓటర్‌గా పేర్లు నమోదు చేయించుకునే అవకాశం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచిఅవకాశం. నేరుగా కాలేజీ సిబ్బంది ఆన్‌లైన్‌లో పేరు చేస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్‌గా నమోదవుతున్నారు.

– ఇ.నవ్యశ్రీ

సద్వినియోగం చేసుకోండి



యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉంది. నేటియువతే ప్రజాప్రతినిధులను ఎన్నుకునేది. అందుకోసమే 18 ఏళ్ల వయసు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేస్తున్నాం. ఎన్నికల వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్నాం.

– తిరుపతిరెడ్డి, ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జి, జూనియర్ కళాశాల

ఆయిల్‌పామ్ సాగుచేయాలి


మాట్లాడుతున్న అధికారులు

మల్యాల(చొప్పదండి): రైతులు వరికి బదులు ఆయిల్‌పామ్ సాగువైపు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ కోరారు. స్థానిక రైతువేదికలో బుధవారం ఆయిల్‌పామ్ సాగు, సస్యరక్షణ, కొత్త రైతుల ఎంపికపై జిల్లా వ్యవసాయాధికారి పి.సురేశ్‌కుమార్, ఏడీఏ టెక్నికల్ కల్పన, హార్టికల్చర్ అధికారి శ్యాంప్రసాద్‌తో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగు ప్రాముఖ్యత, పంటను ఆశించే కొమ్ము పురుగు నివారణపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, ఏవో చంద్రదీపక్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసం శివకుమార్, మండల కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రెడ్డి, ఏఈవోలు కారుణ్యకుమార్, మంజుల, ప్రశాంత్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న సునీత

జగిత్యాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. బుధవారం ఎల్జీ గార్డెన్స్‌లో అంగన్‌వాడీ టీచర్స్ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ, 45ఏళ్లుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ పేదలకు సేవలందిస్తున్నారని, అయినా వీరికి ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వకుండా, పీఎఫ్, పింఛన్ సౌకర్యం కల్పించకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈక్రమంలో తమ హక్కుల సాధనకు ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రజిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి వనిత, కోశాధికారి మాధవి పాల్గొన్నారు.

‘బలగం’ సర్పంచ్‌కు కన్నీటి వీడ్కోలు

- పలువురి సంతాపం
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు


నర్సింగం(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): బలగం సినిమాలో సర్పంచ్‌గా నటించిన కీసరి నర్సింగం అంత్యక్రియలు బుధవారం అభిమానుల కన్నీటి మధ్య పూర్తయ్యాయి. కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన కీసరి నర్సింగం కొన్నేళ్లుగా నాటక ప్రదర్శనలు చేస్తూ గుర్తింపు పొందారు. ఇటీవల వేణు డైరెక్షన్‌లో వచ్చిన బలగం సినిమాలో సర్పంచ్‌గా నటించి అందరి ప్రశంసలు పొందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల సంఘం ప్రధానకార్యదర్శిగా పనిచేస్తున్న నర్సింగం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందారు. నర్సింగంకు భార్య భూమవ్వ, కుమారుడు శ్రీనివాస్, కూతురు అంజలి ఉన్నారు. అంత్యక్రియల్లో జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, డీపీఆర్వో మామిండ్ల దశరథం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, సర్పంచ్ లావణ్య-శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్, నాయకులు రాఘవరెడ్డి, పిట్టల భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.


నర్సింగం మృతదేహంపై కండువా కప్పుతున్న చొక్కాల రాము

ఓటరు నమోదుపై అవగాహన


హాజరైన విద్యార్థులు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూలో బుధవారం స్వీప్ ఓటరు ప్రక్రియపై అవగహన కల్పించారు. 18ఏళ్ల వయసు నిండిన యువతి, యువకులు ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ నరేశ్, వైస్ ప్రిన్సిపాల్ టి.వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా


శిబిరంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: వివిధ హోదాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయం చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్ఎస్ఏ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భవించాక క్రమబద్ధీకరణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరిన్ని వస్తాయని ఉద్యమించిన వారికి నిరాశే ఎదురైందన్నారు. ఆంగ్లం మాధ్యమంలో ఉచిత నిర్బంధ విద్యను అటకెక్కించిన ప్రభుత్వం.. కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు బండ శంకర్, రఘువీర్‌గౌడ్‌తోపాటు సమగ్ర శిక్షా అభియాన్ జేఏసీ ప్రతినిదులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జగిత్యాలటౌన్: కాగా, తారకరామానగర్‌కు చెందిన యువకులు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పెంచిన వేతనాలు చెల్లించండి


వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

జగిత్యాలటౌన్: ప్రభుత్వం ఇటీవల తమకు పెంచిన రూ.3వేల గౌరవ వేతనం, 7 నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ బీఎస్ లతను బుధవారం కలిసి ఒకవినతిపత్రం అందజేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను సవరించాలని వారు కోరారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టనోజు గంగాధర్, ప్రతినిధులు ఆడెపు భాగ్యలక్ష్మి, ఇందంపల్లి గంగమల్లు, ఎంపీడీ రజియాసుల్తానా, రాజేశ్వరి, బత్తిని ఉమ, న్యాత ప్రమీల తదితరులు ఉన్నారు.

క్రమబద్ధీకరించాలని మంత్రికి వినతి

ధర్మపురి: తక్కువ వేతనాలతో ఎక్కువ పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన స్కేలు అమలు చేయాలని విన్నవించారు. నాయకులు బర్ల నారాయణ, కుదుకల రవీందర్, అనుమల్ల శ్రీనివాస్, గజ్జి మల్లేశ్ పాల్గొన్నారు.

బ్యాంకులో మహిళపై చేయిచేసుకున్న వ్యక్తి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐలోకి బుధవారం పని నిమిత్తం ఓ మహిళ వెళ్లింది. అక్కడకు వచ్చిన ఓ వ్యక్తి ఆకస్మికంగా ఆమెపై దాడిచేశాడు. అక్కడే ఉన్న పలువురు ఖాతాదారులు.. ఆమెను ఎందుకు కొడుతున్నావని సదరు వ్యక్తిని అడిగారు. కానీ ఆ వ్యక్తి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి నిందితుడిని మందలించారు. తనది కోరుట్ల ప్రాంతమని, టీఆర్‌నగర్‌లో బంధువుల ఇంటికి వచ్చానని సదరు వ్యక్తి జవాబివ్వడంతో పాటు, తనకు ఇటీవల మతిస్థిమితం లేకుండాపోయిందని తెలిపాడు. దీంతో పోలీసులు ఆ వ్యక్తిని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అర్హుల పేర్లు చేర్చండి

- అదనపు కలెక్టర్ దివాకర


పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ దివాకర

పెగడపల్లి(ధర్మపురి): జిల్లాలో 18ఏళ్ల వయసు నిండిన ప్రతీఒక్కరి పేరు ఓటరు జాబితాలో చేర్చాలని అడిషనల్ కలెక్టర్, ధర్మపురి నియోజకవర్గం ఎన్నికల అధికారి దివాకర సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పుల ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ, నమోదు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. ఆగస్టు 26, 27, ఈనెల 2, 3 తేదీల్లో ఓటరు నమోదు కోసం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించామని అన్నారు. ప్రత్యేక శిబిరాలు ముగిసినా.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 19 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ధర్మపురి నియోజకవర్గంలో 5,500 మంది ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేశారని చెప్పారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా విడుదల చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి, ధర్మపురి, తహసీల్దార్లు ఎంఏ ఫరూక్, కృష్ణచైతన్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అర్థం తెలియని మంత్రి

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌కుమార్

వెల్గటూర్(ధర్మపురి): మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అభివృద్ధి గురించి తెలియదని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఒక్క డబుల్‌బెడ్రూమ్ ఇంటిని అర్హులకు ఇవ్వలేదని, వేలమంది ఇప్పటికీ గుడిసెల్లో బతుకీడుస్తున్నారని అన్నారు. కాళేశ్వరం లింక్–2తో ఇక్కడి గోదావరి నీళ్లను హైదరాబాద్ తరలిస్తున్నా నోరు మెదపడం లేదన్నారు. పీజీ చదివిన నిరుద్యోగులు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారని తెలిపారు. మంత్రి హోదాలో ఉండి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి అభివృద్ధి అని చెప్పుకోవడం శోచనీయమన్నారు. వెల్గటూర్ మండలంలో ఇంటర్ కాలేజీ లేదని దుయ్యబట్టారు. అంబులెన్స్ అందుబాటులో లేదన్నారు. బుగ్గారంలో నిధుల దుర్వినియోగంపై పోరాటం చేస్తే గోల్‌మాల్ చేసిన వారిని వదిలేసి ఆయనను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పాలన చేతకాక పోతే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన సూచించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు బచ్చల స్వామి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ


లోకాయుక్త సంస్థ ఎదుట గంగారెడ్డి

బుగ్గారం(ధర్మపురి: బుగ్గారం గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయనే ఫిర్యాదు మేరకు హైదరాబాద్ లోకాయుక్తలో బుధవారం జరిగిన విచారణకు ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి హాజరయ్యారు. నిధుల వినియోగంపై అధికారులు తప్పుడు సమాచారంతో కూడిన నివేదిక అందజేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. రూ.4,42,761 రికవరీ చేస్తే రూ.1,77,761 రికవరీ చేసినట్లు అధికారులు తప్పుడు సమాచారం అందించారని పేర్కొన్నారు. ఈ క్రమంలో తనవద్ద గల రికవరీ చలాన్ల ప్రతులను లోకాయుక్తకు అందించానని అన్నారు. పత్రికల్లో ప్రచురితమైన కథనాల క్లిప్పింగులను లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ జరిపించాలని అభ్యర్థించినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళల ఆదాయాభివృద్ధి లక్ష్యం

- సెర్ప్ డీపీఎం మల్లేశం


విజయభారతిని సన్మానిస్తున్న సెర్ప్ సిబ్బంది

జగిత్యాలరూరల్: జిల్లాలో మహిళా సంఘాలతో ఎంటర్‌ప్రైజెస్ యూనిట్లు ఏర్పాటు చేయించి, వారి ఆదాయాభివృద్ధికి కృషి చేయాలని డీపీఎం మల్లేశం సూచించారు. బుధవారం స్థానిక సెర్ప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కిరాణం, జనరల్ స్టోర్స్, లేడీస్ ఎంపోరియం, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యూటీపార్లర్, టెంట్‌హౌస్, చేతివృత్తుల యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.40 వేల చొప్పున, పిండి, కారం, పసుపు, నూనె తదితర గిర్నీలు ఏర్పాటు చేసుకున్న వారు అదనపు యూనిట్ల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో అర్హులైన మహిళ సంఘాలను గుర్తించాలని సిబ్బందికిసూచించారు. అనంతరం డీపీఎం(ఫైనాన్స్) విజయభారతి మాట్లాడుతూ, మండల సమాఖ్య, గ్రామ సమైక్య, స్వశక్తి సంఘాల పుస్తకాలు సక్రమంగా రాయాలన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విజయభారతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, రవీందర్, విద్యాసాగర్, సంతోష్, రాజేందర్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలు


మల్లాపూర్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న పంట


కోతకు గురైన గుండంపల్లి రోడ్డు

మల్లాపూర్(కోరుట్ల): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు. బుధవారం సగటున 16.4 మీ.మీ. వర్షపాతం నమోదైందని సహాయ గణాంకాధికారి(ఏఎస్‌వో) శ్రీనివాస తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గుండంపల్లి మార్గంలో పెద్దవాగు బ్రిడ్జిపై వరద ఉధృతి పెరిగింది. రెండు వైపుల రోడ్డు కోతకు గురైంది. మల్లాపూర్‌తోపాటు పలుగ్రామాల్లో మొక్కజొన్న, వరి, చెరుకు పంటలుకు నష్టం వాటిల్లింది. ఎస్సారెస్పీ గెట్లు ఎత్తి వరదనీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దవాగుకు వరద పోటెత్తింది. తహసీల్దార్ వీర్‌సింగ్, ఎస్సై నవీన్‌కుమార్, ఎంపీడీవో జగదీశ్ తీరప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చెరువు మత్తడి పరిశీలన

కోరుట్లరూరల్: కల్లూరు శివారు పాలచెరువు మత్తడి వర్షాలకు దెబ్బతినటంతో రైతులు బుధవారం ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతు చేశారు. మత్తడి అతి పురాతనమైనది కావటంతో వరదలకు దెబ్బతిన్నట్లు సర్పంచ్ వనతడుపుల అంజయ్య తెలిపారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో ఇరిగేషన్ డీఈ తిరుమలేశ్, ఏఈ సిరాజొద్దీన్ మత్తడి, చెరువుకట్ట, మాటు కాలువ పరిశీలించారు. శాశ్వత చర్యల కోసం నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంకె రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.